మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

గణిత మేళాను పరిశీలిస్తున్న ఎంఈవో విజయరామారావు

కొడంగల్, జనవరి 6 : పది పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ గ్రేడును సాధించాలని ఎంఈవో విజయరామారావు సూచించారు. సోమవారం దుద్యాల మండలంలోని కుదురుమల్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గణిత మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా కరన్‌కోట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ డా.ప్రవీణ్‌కుమార్ సమకూర్చిన ఆల్ ఇన్ వన్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులపై శ్రద్ధతో ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందించి ప్రోత్సహించడంపై మాజీ ఎంపీటీసీని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ నిర్వహించిన గణిత మేళా ప్రదర్శనను తిలకించి, విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులను రాబట్టారు. గణిత మేళాలో విద్యార్థులు విశదీకరించిన తీరుకు విద్యార్థులను అభినందించారు. ఇష్టంగా చదువుకున్నప్పుడే విద్యపై పూర్తి పట్టు సాధించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రఘుపతి, ఎంపీటీసీ జనార్దన్‌గౌడ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మాజీ జేహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు భూ సర్వే ప్రారంభం

పోలెపల్లి గ్రామంలో భూ సర్వే చేపడుతున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

కొడంగల్, జనవరి 6 : ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు దుద్యాల మండలంలోని హకీంపేట, పోలెపల్లి, లగచెర్ల, రోటిబండతండా, పులిచెర్లకుంటతండాల్లో భూ సేకరణకు సంబంధించి సర్వే పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం పోలెపల్లి గ్రామ పరిధిలో సర్వే నం.67లోని 71 ఎకరాల 3 గుంటలకు సంబంధించిన ప్రభుత్వ భూమిలో దుద్యాల తహసీల్దార్ కిషన్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. పట్టాదారులకు సంబంధించిన సర్వే నంబర్ ఆధారంగా భూమి మూలాలను అధికారులు గుర్తించారు. పట్టా పాస్‌పుస్తకం ప్రకారం భూమి పొజిషన్‌లో ఉన్నారా లేదా అనే విషయాలపై సర్వే చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు, ఆర్ఐ నవీన్, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఆల్ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ఓటరు ముసాయిదా

జాబితా విడుదల

కొడంగల్ నియోజకవర్గ పరిధిలో 2,46,526 మంది ఓటర్లు

కొడంగల్, జనవరి 6 : 2025కు సంబంధించి కొడంగల్ నియోజకవర్గ నూతన ఓటరు జాబితా ప్రచురితమైనట్లు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. సోమవారం ఓటరు జాబితా ప్రచురణపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆల్ పార్టీ నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 2024లో ప్రచురితమైన ఓటరు జాబితాలో కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల, కోస్గి, మద్దూర్, కొత్తపల్లి, గుండుమాల్ మండలాల పరిధిలో 2,46,526 ఓటర్లు కాగా.. ప్రస్తుతం 3,076 ఓటర్లు పెరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

నియోజకవర్గపరిధిలో ఓటర్ల వివరాలు

మండలం	ఓటర్లు	మహిళలు	పురుషులు
కొడంగల్	39,391	20,099	19,292
బొంరాస్‌పేట	32,388	16,348	16,040
దౌల్తాబాద్	40,687	20,782	19,901
దుద్యాల	24,537	12,579	11,958
కోస్గి	36,404	18,465	17,938
కొత్తపల్లి	16,761	8,605	8,155
మద్దూర్	38,789	19,852	18,937
గుండుమాల్	17,569	8,910	8,658

న్యాయం కోసం వెళితే దుర్భాష

నవాబుపేట ఎస్ఐని సస్పెండ్ చేయాలని ఎస్పీకి ఫిర్యాదు

వికారాబాద్, జనవరి 6 : న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళితే దుర్భాషలాడిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర కార్యదర్శి గీత, సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఏఐకేఎస్ఎస్ జిల్లా కార్యదర్శి మల్లేశ్ తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలోని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవాబుపేట మండలం మాదారం గ్రామానికి చెందిన ఒక మహిళ భూమిని అదే గ్రామానికి చెందిన కొంత మంది తమకు అమ్మాలంటూ ఒత్తిడి చేస్తూ, బెదిరిస్తూ ఇబ్బందిపెడుతున్నారన్నారు. బాధితురాలి తల్లి పొలంలో పనులు చేస్తుండగా కొట్టిన సందర్భంలో పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. మహిళను కించపరిచేలా మాట్లాడుతూ దుర్భాషలాడిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఎస్పీ కార్యాలయం వద్ద ఫిర్యాదు పత్రంతో బాధితులు

ఆలయ అభివృద్ధిపై అధికారుల సమీక్ష



మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధిపై అధికారుల సమీక్ష

కొడంగల్, జనవరి 6 : పట్టణంలోని మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. ఇందులోభాగంగా సోమవారం శ్రీనివాసరాజు ఐఏఎస్‌తోపాటు తెలంగాణ దేవాదాయ శాఖల అధికారులు ఆలయాన్ని సందర్శించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం ఆలయంలో స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేటు వాహనాలపై చర్యలు చేపట్టండి

ఎస్ఐకి ఫిర్యాదు అందజేస్తున్న కంట్రోలర్

కొడంగల్, జనవరి 6 : కొడంగల్ బస్టాండ్ ఆవరణలో ప్రైవేట్ వాహనాల నిలుపుదల కారణంగా ఆర్టీసీ బస్సులతోపాటు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదని కంట్రోలర్ పీఎన్ రెడ్డి సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంత మంది బస్టాండ్ ఆవరణలో దౌర్జన్యంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని, అటువంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

ధారూరు మండలంలో ఓటర్లు 36100

ధారూరులో ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేస్తున్న తహసీల్దార్ షాజిదా బేగం

ధారూరు, జనవరి 6 : ధారూరు మండలం 32 గ్రామపంచాయతీల పరిధిలోని వివిధ గ్రామాల్లో 36100మంది ఓటర్లు ఉన్నారని ధారూరు తహసీల్దార్ షాజిదా బేగం తెలిపారు. సోమవారం ధారూరులోని తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేశారు. మండల పరిధిలో పురుషులు 17739, మహిళలు 18361, మొత్తం 36100 మంది ఓటర్లు ఉన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్ఐలున్నారు.

రేపు కులకచర్ల మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం

కులకచర్ల, జనవరి 6 : కులకచర్ల మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం ఈ నెల 8న నిర్వహించనున్నట్లు కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు తెలిపారు. కులకచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం 11 గంటలకు సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నూతన పాలక వర్గం ఏర్పాటు చేసినందున ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం, మార్కెట్ యార్డు అభివృద్ధి పనుల గురించి, మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమతితో ఇతర అంశాలపై చర్చ నిర్వహించనున్నట్లు తెలిపారు.

చెత్తను తరలిస్తున్న లారీలు

ప్రజల ప్రాణాలతో చెలగాటం

- హైదరాబాద్ నగర శివారు దమ్మాయిగూడ నుంచి కల్బుర్గి సిమెంట్ ఫ్యాక్టరీకి రోజుకు 25 లారీల చెత్త
- పెద్దేముల్ మండలం మంబాపూర్ మీదుగా రవాణా
- భరించలేని దుర్గంధంతో సతమతవుతున్న ప్రజలు

పెద్దేముల్, జనవరి 6 : పెద్దేముల్ మండల పరిధిలోని మంబాపూర్ గ్రామం మీదుగా రోజుకు సుమారు 25 లారీల చెత్త హైదరాబాద్ నగర్ శివారు ప్రాంతమైన దమ్మాయిగూడ డంపింగ్ యార్డు నుంచి కల్బుర్గి సిమెంట్ ఫ్యాక్టరీకి రవాణా చేస్తున్నట్టు సమాచారం. సోమవారం యథావిధిగా లారీల్లో చెత్త తరలిస్తుండగా మంబాపూర్ గ్రామంలో రోడ్డుపై చెత్త పడి ఆ ప్రాంతమంతా దుర్గంధంతో నిండిపోయింది. దీంతో గ్రామస్తులు పంచాయతీ సెక్రటరీకి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో ఆ చెత్త లారీలను గ్రామ శివారులోని రైతు వేదిక దగ్గర ఆపి, లారీలకు సంబంధించిన వ్యక్తులకు సమాచారం అందించారు. లారీలు ఎక్కడివి, వాటికి పర్మిషన్ ఉందా? బహిరంగంగా చెత్త తీసుకురావడం సరైనదేనా అన్న విషయాలను పరిశీలించారు. ఈ విషయాన్ని సెక్రటరీ పై అధికారులకు తెలిపారు. వారి ఆదేశానుసారంగా తదుపరి చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వాతావరణాన్ని కాలుష్యంగా మార్చే ఈ విధానాలపై కాలుష్య మండలి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాము కాటుతో మహిళ మృతి

అత్తెల్లి సరిత(ఫైల్)

మర్పల్లి, జనవరి 6 : పాము కాటుతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని బుచన్‌పల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బూచన్‌పల్లి గ్రామానికి చెందిన అత్తెల్లి సరిత(45) మిషన్ కుడుతూ వ్యవసాయం చేసేది. సోమవారం ఉదయం చిన్న కుమారుడితో కలిసి తన పొలంలో ఉన్న కందిపంటను ఒక్క దగ్గర పెడుతుండగా పాము కాటు వేసింది. గమనించిన కుమారుడు గ్రామస్తుల సహాయంతో మర్పల్లి ప్రభుత్వ అసుపత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ అసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త నర్సింహులు, ఇద్దరు కుమారులున్నారు.

దొంగతనం కేసులో రెండేండ్ల జైలు

కొడంగల్, జనవరి 6 : దొంగతనం కేసుకు సంబంధించి నేరస్తుడికి రెండేండ్ల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ కొడంగల్ కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్ సోమవారం తీర్పును వెల్లడించినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. 2016 ఆగస్టు 29న దుద్యాల మండలంలోని హస్నాబాద్ గ్రామంలో బొయిన మొగులప్ప ఇంట్లో దొంగతనం జరిగింది. 30 తులాల వెండి కడియాలు గుర్తు తెలియని దొంగలు అపహరించినట్లు వచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. విచారణ దర్యాప్తు చేసి నేరాభియోగపత్రాలు దాఖలు చేయగా కోర్టు కేసు విచారణ తర్వాత సోమవారం ముద్దాయికి రెండేండ్ల జైలు, రూ.500 జరిమానా విధించారని తెలిపారు.

తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం దోమ మండల నూతన కార్యవర్గం

దోమ, జనవరి 6 : దోమ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం(టీజీయూఎస్) దోమ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా.. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. టీజీయూఎస్ దోమ మండల అధ్యక్షుడిగా సూర్యానాయక్ అయినాపూర్ ప్రాథమిక పాఠశాల., ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్ దోమ ప్రాథమిక పాఠశాల., గౌరవ అధ్యక్షుడిగా గోపాల్ ఎస్ఏ మ్యాథ్స్ దోమ బాలుర పాఠశాల., బాలు, నెహ్రూ, శంకర్, రాజు తదితరులు కార్యవర్గ సభ్యులుగా., మహిళా అధ్యక్షురాలిగా సంధ్యారాణి., కార్యదర్శిగా శోభ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిమ్యానాయక్, ప్రధాన కార్యదర్శి కల్యానాయక్, ఎంఈవో వెంకట్, ఉపాధ్యాయులున్నారు.

పంటల పరిశీలన

పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి భూపతి జయశంకర్

వికారాబాద్, జనవరి 6 : వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు సోమవారం మోమిన్‌పేట మండలం సైదలీపూర్ గ్రామంలో యాసంగి కాలంలో రైతులు పండించిన పంటలను మండల వ్యవసాయ అధికారి భూపతి జయశంకర్ పరిశీలించారు. పంటలపై రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. వారితోపాటు వ్యవసాయ విస్తరణ అధికారుల బృందం క్షేత్ర పరిశీలన చేశారు. ఈ పంటల్లో అత్యధికంగా కూరగాయ పంటలున్నాయని పేర్కొన్నారు. పంటల నమోదు క్షేత్ర పర్యటన కార్యక్రమం 8వ తేదీ వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బృందం, రైతులు ఉన్నారు.

అనుమానాస్పదస్థితిలో

విద్యార్థిని మృతి

- గుట్టుచప్పుడు కాకుండా విద్యార్థిని మృతదేహం ఉస్మానియాకు తరలింపు
- అగస్త్య కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు
- ఎస్ఎఫ్ఐ సంఘం ఆగ్రహం
- కళాశాలలోని ఫర్నిచర్ ధ్వంసం
- ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్ట్

కళాశాలలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదిబట్ల, జనవరి 6 : ఆదిబట్ల అగస్త్య జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థిని అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. ఈ విషయం ఎక్కడా బయటికి రాకుండా కళాశాల యాజమాన్యం విద్యార్థిని మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా తరలించారు. ఈ విషయం సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహబూబాబాద్ జిల్లా, పెద్దవంగర మండలం, పోచంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని మైలపాకం సోనీ(19) ఆదిబట్ల టీసీఎస్ సమీపంలోని అగస్త్య జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నది. సోనీ రెండు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా.. కళాశాల యాజమాన్యం ఆర్ఎంపీ డాక్టర్‌తో ట్రీట్‌మెంట్ చేయించారు. అయినా సోనీకి జ్వరం తగ్గకపోవడంతో ఆదివారం రాత్రి విద్యార్థిని పరిస్థితి విషమించింది. వెంటనే కళాశాల యాజమాన్యం ఆ విద్యార్థినిని చికిత్స నిమిత్తం మన్నెగూడలోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో వెంటనే వారు యశోద ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే మృతి చెందింది. దీంతో కళాశాల యాజమాన్యం పోలీసులకు సమాచార మిచ్చారు. పోలీసుల సహాయంతో విద్యార్థిని మృతదేహాన్ని నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదుతో కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక విద్యార్థిని మృతికి గల కారణాలు తెలుస్తాయన్నారు. ఎఫ్ఐఆర్ కాపీని డీఐఈవోకు అందజేశామని తెలిపారు.

అగస్త్య జూనియర్ కళాశాలలో విద్యార్థిని సోనీ మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తరుణ్, జాయింట్ సెక్రెటరీ వంశీ, స్టాలిన్ నాయకులతో కలిసి అగస్త్య కళాశాల ఎదుట ధర్నాకు దిగారు. కళాశాలలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

కాపర్ కేబుల్ చోరీ

పరిగి, జనవరి 6 : ఓ మొబైల్ టవర్లలోని కాపర్ కేబుల్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. పరిగి మండలం చిట్యాల్, సయ్యద్‌పల్లిలోని ఓ మొబైల్ కంపెనీ సెల్ టవర్ల పరిధిలో ఆదివారం అర్ధరాత్రి నుంచి మొబైల్ సిగ్నల్స్ నిలిచిపోవడంతో సిబ్బంది వెళ్లి చూడగా కాపర్ కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు సంబంధిత కంపెనీ యాజమాన్యానికి సమాచారం అందించారు. వాహనంలో వచ్చి దొంగలు ఈ చోరీకి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు.

దర్పణ్‌తో.. ఆ పిల్లలకు విముక్తి

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : తప్పిపోయిన పిల్లలు, వివిధ కారణాలతో కుటుంబాల నుంచి విడిపోయిన పిల్లలను 'దర్పణ్' అనే ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌తో గుర్తించి వారి కుటుంబాలకు అప్పగిస్తున్నామని మహిళా, శిశు సంరక్షణ విభాగం డీసీపీ సృజన కర్ణం తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్‌లోని సోమవారం నిర్వహించిన ఆపరేషన్-11 సమీక్షలో సృజన మాట్లాడుతూ.. ఈ ఏడాది జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వెట్టిచాకిరి చేస్తున్న బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న చిన్నారులు, ట్రాఫికింగ్‌కు గురైన పిల్లలను గుర్తిస్తున్నామన్నారు. అంతేకాకుండా తప్పిపోయిన పిల్లలను ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌తో గుర్తించి వారి కుటుంబాలకు అప్పగిస్తున్నామని చెప్పారు. ఆపరేషన్ స్మైల్ కోసం కమిషనరేట్ పరిధిలో మొత్తం 11 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని ఒక్కో బృందంలో ఒక ఎస్ఐ స్థాయి అధికారితో పాటు ఒక మహిళా కానిస్టేబుల్, మరో ముగ్గురు కానిస్టేబుళ్లు ఉంటారని వివరించారు. ఆపరేషన్ స్మైల్‌పై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టి, కుటుంబాలకు దూరమైన చిన్నారులను చేరదీసి, తిరిగి వారి కుటుంబాలకు అప్పజెప్పేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మహిళా, శిశు సంరక్షణ విభాగం ఏసీపీ ప్రసన్నకుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటి ప్రతినిధి నరేందర్‌రెడ్డి, బచ్‌పన్ బచావో ఆందోళన్ స్టేట్ కోఆర్డినేటర్ అందె వెంకటేశ్వర్లు, జిల్లా శిశు సంరక్షణ అధికారులు ఇంతియాజ్, రత్నం పాల్గొన్నారు.

రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప

యాలాల, జనవరి 6 : గత ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేసిన రైతు బంధు పథకం ద్వారా రైతులందరికీ ఎకరానికి ఏటా రూ.10,000 చొప్పున చెల్లించడం జరిగిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప సోమవారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. రైతు బంధు ఎకరాకు ఏటా రూ.15000 చెల్లిస్తామని కల్లిబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ హామీని తుంగలో తొక్కిందని మండిపడ్డారు. ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో రైతులకు రూ.15000లకు బదులుగా రూ.12000 చెల్లిస్తామని నిర్ణయించడం రైతులను మోసం చేయడమేనన్నారు. వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసా రూ.15000 వెంటనే రైతుల ఖాతాల్లో వేయాలన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే జరిగే పరిణామాలకు సర్కారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

వీధి విక్రయదారులకు ఇన్సూరెన్స్ తదితర వాటిని అందజేస్తున్న చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, జనవరి 6 : అర్హులైన స్ట్రీట్ వెండర్స్ లోన్స్ సహాయంతో వ్యాపారంలో దినదినాభివృద్ధి చెందాలని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. సోమవారం వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ హాల్లో స్వానిధి సమృద్ధి క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 8 రకాల స్కీములకు అర్హులైన వికారాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న స్ట్రీట్ వెండర్స్ వారి కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్ట్రీట్ వెండర్స్‌కు ఇన్సూరెన్స్, జన్‌ధన్ బ్యాంకు ఖాతాలు, ఈ శ్రమ్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, పట్టణ పథక సమన్వయ అధికారి వెంకటేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాలిని, ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ జయవర్ధన్, అధికారులు పాల్గొన్నారు.

యువకుడు మృతి

కందుకూరు, జనవరి 6 : నగర శివారులోని కందుకూరులో ఓ రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. కందుకూరు పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తాండూరు మండలం బాలన్నపల్లి గ్రామానికి చెందిన చిన్నయ్య కుమారుడు భరత్(20)తో పాటు రైతులు కొమ్ము దయాకర్, పసుపుల కుమార్, మనకూరి రమేశ్, గోనెల సాయి, డ్రైవర్ శివకుమార్ యొక్క బొలెరో వాహనంలో హైదరాబాద్‌లో ఎండు మిర్చి అమ్మడానికి బయలుదేరారు. వారు స్వగ్రామం నుంచి ఆదివారం రాత్రి దెబ్బడగూడ గేటు సమీపంలోకి రాగానే కందుకూరు నుంచి కడ్తాల్ వైపు వెలుతున్న కారు అజాగ్రత్తగా వచ్చి బోలెరో వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న భరత్ మృతిచెందాడు. మిగిలిన రైతులకు తీవ్రగాయాలయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ మోసం

బీఆర్ఎస్ బషీరాబాద్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి

బషీరాబాద్, జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం అంకెల గారడితో రైతులను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ బషీరాబాద్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రైతు బంధు రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు 12 వేలకు తగ్గించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం గడచినా రైతులకు ఇప్పటి వరకు రైతు బంధు అందలేదన్నారు. మాయమాటలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టే దిశగా వెళుతున్నది తప్పా ప్రజలకు మేలు చేసే పనులు చేయడం లేదన్నారు. పంట సాయం కోసం ఎదురుచూసిన రైతులకు చివరికి నిరాశే మిగిలిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసా రూ.15వేలు, ఒక సంవత్సరం ఎగ్గొట్టిన రైతు బంధును కలిపి రైతుల భాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాని రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలన్నారు. రైతు భరోసా రూ.15వేలు కాకుండా 12 వేలు ఇస్తే రైతులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు.

PUBLIC NOTICE

The General Public are hereby informed that my client Smt. Jonna Kalavathi. W/o. Late Shiva, Aged about 55 years, Occ: Housewife, R/o. H.No. 11-51, Mangalapuram, Duggirala Village and Mandal, Guntur District, presently Residing at H.No. 14-191, Plot No. 12, Opposite: TKR College, South Gate, Meerpet Village, Balapur Mandal, Ranga Reddy District-500 058, Cell No. 6305898913 (Aadhar No. 6149 1257 8167) has Lost her Original Sale Deed bearing Document No. 12776/1979, Dated 17-12-1979, Registered at S.R.O. Hayathnagar, Ranga Reddy District in respect of Open Plot bearing No. 532, admeasuring 500 Sq.yards, situated at Jalpally Village, Hyderabad East, Ranga Reddy District, under the Limits of Jalpally G.P. standing in the Name of My client's Father Guggila Pullaiah, S/o. Veeraiah, while she was shifting house from Meerpet to Almasguda Village and inspite of her best efforts she could not able to trace it and it is Lost beyond recovery.

If any person/s is/are got above Original Sale Deed he/she/they may handover the same to the undersigned within seven (7) days from the date of this Publication.

Sd/- (G.NARSI REDDY), Advocate
H.No. 6-171, Opp: Shivalayam Temple, Shivalayam Veedi, Ibrahimpatnam, Ranga Reddy District,
Phone No. 9839158555.
Hyderabad, Dated 06-01-2025.